సాక్షి
శ్రీకాకుళం
గురువారం ၊ 31 ၊ అక్టోబర్ ၊ 2024



ఉత్సాహంగా తైక్వాండో ఎంపికలు

అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే మహిళా తైక్వాండో క్రీడాకారిణుల ఎంపికలు బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ వర్సిటీలో ఈ పోటీలు జరిగాయి. - 8లో



పవిత్ర ఆధ్యాత్మిక మాసం

హరి, హరులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం కార్తీకం. ఉపవాస దీక్షలు, ప్రత్యేక పూజలకు భక్తులు సిద్ధమవుతున్నారు. - 8లో

నవోదయ ప్రవేశాలకు గడువుపెంపు

నరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు నవంబర్ 9 వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

అరసవల్లిలో నరకచతుర్దశి



ఉత్సవమూర్తులతో తిరువీధి



చిన్నతోటలో నరకాసుర దహనం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నరక చతుర్దశి ఉత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అనివెట్టి మండపంలో ఉషా పద్మిని ఛాయాదేవేరులతో ఆదిత్యుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళహారతి ఇచ్చిన అనంతరం ఉత్సవమూర్తులను తిరువీధిగా తీసుకెళ్లి ఆలయ ఉద్యానవన తోట (చిన్న తోట)లోని మండపంలో కొలువుదీర్చారు. అనంతరం నరకాసురుని బొమ్మను దహనం చేశారు. తిరిగి ఉత్సవమూర్తులను ఆలయంలో చేర్చారు. కార్యక్రమంలో ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

శ్రీకాకుళం క్రైమ్: నూతన మద్యం పాలసీ ఆధారంగా ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం ధరల పట్టికను దుకాణాలు ముందు తప్పనిసరిగా ఉంచాలని, దీన్ని అమలుపరిచేలా స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది నిరంతరం నిఘా పెట్టాలన్నారు. బెల్టు దుకాణాలు ఎక్కడ నిర్వహించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసే దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



ఈదుపురంలో పర్యటిస్తున్న ఎస్పీ, జేసీ, అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నవంబర్ 1న ఈదుపురం వస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సీఎం సభాస్థలి, హెలీప్యాడ్ ప్రదేశంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జాగ్రత్తలతోనే హ్యాపీ దీపావళి

శ్రీకాకుళం పీఎన్ కాలనీలో దీపావళి సందడి / ఫొటో : సాక్షి ఫొటో గ్రాఫర్, శ్రీకాకుళం



దీపావళి అంటేనే సందడి. చిచ్చుబుడ్లు నుంచి బాంబుల వరకు మోత మోగాల్సిందే. అయితే మనం కాల్చే టపాసుల్లో ఉన్న రసాయనాలు వాతావరణానికి తీరని నష్టాన్ని కలిగిస్తాయనే వాస్తవాన్ని విస్మరించకూడదు. అందుకే కాలుష్యం నింపి పర్యావరణాన్ని నష్టం కలిగించేలా కాకుండా పర్యావరణ హితంగా దీపావళి పండగ జరుపుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ఇందుకోసం మార్కెట్‌లో లభిస్తున్న ఎకో ఫ్రెండ్లీ గ్రీన్ టపాసులు కొనుగోలు చేయడంతో పాటు వీలైనంత తక్కువ శబ్దాన్ని ఇచ్చే బాణసంచాను వినియోగించాలని పర్యావరణవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. పండగ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై కథనం..

శ్రీకాకుళం కల్చరల్/ఎల్.ఎన్.పేట/హిరమండలం/గార/శ్రీకాకుళం/శ్రీకాకుళం క్రైమ్/టెక్కలి/కవిటి

- కాలుష్యం కాదు.. వెలుగుల నింపాలి
- గ్రీన్ టపాసులకు ప్రాధాన్యమివ్వాలి
- రసాయనాలతో ముప్పు పొంచి ఉందంటున్న వైద్యులు

హద్దులు దాటితే అనర్థమే



- టపాసుల్లో టాక్సిక్ కారకాలైన రాగి, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, జింక్, సోడియం, పొటాషియం, గంధకం వంటివి ఉండటంతో శ్వాసకోస వ్యాధులకు కారణమవుతాయి. ముఖ్యంగా భూచక్రాలు, పాము మాత్రలు, మతాబులు, చిచ్చుబుడ్లు వల్ల అధికంగా పొగ వ్యాపిస్తుంది.
- టపాసులు పేల్చినప్పుడు వెలువడే ధ్వని అపరిమితంగా ఉంటుంది. బాణసంచా కాల్చేటప్పుడు 125 నుంచి 130 డెసిబుల్స్ శబ్దం వెలువడుతుంది. సాధారణంగా మనిషి వినికిడి శక్తి 50 డెసిబుల్స్ మాత్రమే. అంతకు మించి శబ్దాలను వింటే చెవికి నష్టం తప్పదు. కొంతమంది వినికిడి సమస్యల బారిన పడతారు. మరి కొందరు అతి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ టపాసులను కాల్చుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటారు. ఈ పరిస్థితులు రాకుండా జాగ్రత్తలతో దీపావళిని జరుపుకుని తీపి గుర్తుగా మిగుల్చుకునేందుకు ప్రయత్నించడం ఉత్తమం.

అప్రమత్తతే శ్రీరామరక్ష..



- లైసెన్స్ ఉన్న దుకాణాల వద్ద బాణసంచా కొనుగోలు చేయాలి.
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారుల బాణసంచా కాల్చాలి.
- విద్యుత్ తీగల కింద నిల్చుని టపాసులు కాల్చరాదు. వదులుగా ఉన్న కాటన్ దుస్తులను ధరించాలి
- కాకర పువ్వొత్తులు కాల్చిన వెంటనే వాటిని ఆర్పేందుకు సమీపంలో నీళ్ల డబ్బాలను ఉంచుకోవాలి.
- ఆరుబయట దీపావళి టపాసులు కాల్చాలి. ఇంట్లో కాల్చకూడదు.
- ఆస్పత్రుల సమీపంలో, పెట్రోల్ బంకులు ఉన్న ప్రాంతాల్లో కాల్చొద్దు.
- విధిగా పాదరక్షలు ధరించాలి, అందుబాటులో నీళ్లు పెట్టుకోవాలి.
- బాణసంచా కాల్చినప్పుడు గాయాలైతే వెంటనే చల్లని నీరు పోస్తే ఇన్నర్ లేయర్ కాలదు. ఉపశమనం కలుగుతుంది. తర్వాత వైద్యుడిని సంప్రదించాలి.

ఇలా చేస్తే ముప్పే..

- పేలని టపాసుల వద్దకు వెళ్లి తొంగి చూడకూడదు.
- గుడిసెలు ఉన్న ప్రాంతంలో తారాజువ్వలు వేయరాదు.
- జేబుల్లో బాణసంచా పెట్టుకోకూడదు.
- చేతుల్లో బాంబులు పేల్చడం హానికరం.
- విద్యుత్ బల్బులు, డెకరేటివ్ బల్బులు అధికంగా పెట్టరాదు. వీటితో షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

రూ.అర కోటితో తీయని వేడుక



దీపావళి సందర్భంగా రూ.50 లక్షలకు పైనే స్వీట్స్, డ్రైఫ్రూట్స్ విక్రయాలు జరిగాయి. పండగ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేయటం గతంలో కొన్ని సామాజికవర్గాలకే ఆనవాయితీగా ఉండేది. కాలక్రమేనా మరిన్ని వర్గాలకు విస్తరించింది. దీంతో స్వీట్స్, డ్రైఫ్రూట్స్ విక్రయాలు జోరందుకున్నాయి. వారం రోజుల ముందే చాలామంది ఆర్డర్లు ఇచ్చారు.

ప్రమాదాలు సంభవిస్తే..



టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు 101, 100, 108 టోల్ ఫ్రీ నంబరుతో పాటు అగ్ని మాపక శాఖ కార్యాలయాలను వెంటనే సంప్రదించాలి..

అగ్ని మాపక కేంద్రం	ఫోన్ నంబర్
టెక్కలి	08945 244277
కోటబొమ్మాళి	08942 238659
సోంపేట	08947 234101
మందస	08947 237101
పలాస	08945 241101
ఇచ్ఛాపురం	08947 231101
నరసన్నపేట	08942 276777
ఆమదాలవలస	08942 286401
పొందూరు	08941 242101
శ్రీకాకుళం	08942 222099
రణస్థలం	08942 234499
కొత్తూరు	08946 258444

ఫైర్ 101 పోలీస్ 100 అంబులెన్స్ 108

అనర్థాలే అధికం..

భారీ శబ్దాలు, రసాయనాలు వెలువరించే బాణసంచా స్థానంలో మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలను వెలిగించాలి. నెయ్యి దీపాలను వెలిగించటం వల్ల ఆక్సిజన్ కూడా ఎక్కువగా వెలువడుతుంది. గాలి, శబ్ద కాలుష్యం నివారించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. టపాసుల తయారీలో కాపర్, కాడ్మియం, లెడ్, అమ్మోనియం, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, సోడియం, మెర్క్యూరీ, లిథియం, పొటాషియం వంటి అనేక మిశ్రమాలతో తయారు చేస్తారు. వీటి నుంచి వచ్చే వెలుగులతో కన్ను, ఘాటు వాసనతో ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడతాయి.

హానికారకాలతో తస్మాత్ జాగ్రత్త

రసాయనం	సమస్య
కాపర్	చిరాకు కలిగిస్తుంది
కాడ్మియం	రక్తప్రసరణలో ఇబ్బంది
సీసం	నరాల వ్యవస్థపై ప్రభావం
మెగ్నీషియం	మానసిక స్థిమితం కోల్పోవటం
జింక్	జ్వరం, వాంతులు
సోడియం, బేరియం	కాలటం (బర్న్)

రసాయనాలతో ప్రమాదం



దీపావళి టపాసుల కాల్చినప్పుడు వెలువడే రసాయనాలతో అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. టపాసులు కాల్చే సమయంలో వచ్చే వెలుగులు కంటి చూపును, వెలువడే ఘాటు వాసనలు ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. వీలైనంత మేర కంటి అద్దాలు తప్పని సరిగా వాడి జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సీతూ, ప్రభుత్వ ఆస్పత్రి, తురకపేట, ఎల్.ఎన్.పేట

కనుపాప జాగ్రత్త..



టపాసులు కాల్చే సమయంలో కంటిలో నలక పడినట్లు అనిపిస్తే కళ్లు చేతులతో రుద్దకుండా నీటితో శుభ్రం చేసుకోవాలి. దెబ్బ తగిలితే వెంటనే వైద్యుని సంప్రదించాలి. నిప్పురవ్వలు కంటిలో పడితే నల్ల గుడ్డు కాలిపోయి కార్నియా దెబ్బతింటుంది. కంటికి ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే ప్రమాదముంది.

– డాక్టర్ బొడ్డేపల్లి అనూష, నేత్ర వైద్యనిపుణులు

గర్భిణులు జాగ్రత్త



దీపావళి రోజున బాణసంచా నుంచి వెలువడే పొగ నుంచి గర్భిణులు, బాలింతలు దూరంగా ఉండాలి. బిడ్డకు ఆక్సిజన్ స్థాయి తగ్గి అపస్మారక స్థితికి చేరే ప్రమాదం ఉంది. శ్వాస కోశ సమస్యలు వచ్చే అవకాశముంది. ఏదైనా ప్రమాదం సంభవించినపుడు తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలి.

– కె.ధనలక్ష్మి, ప్రసూతి వైద్యురాలు, జిల్లా ఆసుపత్రి, టెక్కలి

మా ఊరే దీపావళి

దీపావళి పండగ మాత్రమే కాదండోయ్.. మన జిల్లాలోని రెండు గ్రామాల పేర్లు కూడా. గార, టెక్కలి మండలాల పరిధిలోని 'దీపావళి' పేరిట గ్రామాలున్నాయి. ఊర్లకు ఈ పేరు పెట్టడం వెనుక చరిత్ర ఉంది. శ్రీకాకుళం ప్రాంతాన్ని పరిపాలించిన కళింగ రాజు ప్రతీ రోజూ గుర్రంపై శ్రీకాకుళం నుంచి కళింగపట్నం వరకు వెళ్తుండేవారు. ఓ రోజు మార్గమధ్యలో సొమ్మసిల్లిపోవడంతో వైష్ణవులు, గోవుల కాపరులు సపర్యలు చేసి కాపాడతారు. రాజు మేల్కొన్న తర్వాత ఊరి పేరు అడగ్గా, తమకు ఊరు పేరు లేదని వారు చెబుతారు. ఈ ఘటన దీపావళి రోజున జరగటంతో ఆ ప్రాంతానికి దీపావళి అని పేరు పెట్టినట్టు పెద్దలు చెబుతుంటారు. టెక్కలి మండలం అయోధ్యపురం పంచాయతీ పరిధిలోనూ 'దీపావళి' గ్రామం ఉంది.



గార మండలంలోని దీపావళి గ్రామం వద్ద బోర్డు

టెక్కలి నుంచి బన్నువాడ గ్రామం మీదుగా సుమారు 7 కిలోమీటర్ల దూరంలో మారుమూల ప్రాంతంలో ఈ ఊరు ఉంది. పండగ పేరుతో ఉన్న ఈ గ్రామంలో మొత్తం 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

'విభిన్న' ప్రమిదలు





కేంద్రం నిర్వాహకురాలు శ్యామల

వినూత్న ఆలోచనల్లోనూ తాము ఎవరికీ తీసిపోమని నిరూపిస్తున్నారు కొందరు విభిన్న ప్రతిభావంతులు. దీపావళి సందర్భంగా అందమైన రంగులలో వినూత్నమైన రూపాల్లో సృజనాత్మకతతో ప్రమిదలు తయారు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బెహరా మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులు ప్రమిదలకు అందమైన రంగులు అద్దుతూ అమ్మకానికి సిద్ధం చేశారు. 74 మంది విభిన్న ప్రతిభావంతులు ఈ ప్రమిదలు రూపొందించారని, ప్రమిదలు ధర రూ.5 నుంచి రూ.60 వరకు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల వారు కొనుగోలు చేయాలనుకుంటే 9848868960 నంబరును సంప్రదించాలని నిర్వాహకురాలు శ్యామల కోరారు.



ప్రమిదలకు రంగులు అద్దుతున్న దివ్యాంగులు



అమ్మకానికి పెట్టిన ప్రమిదలు

అందరికీ కాదు కొందరికే..!

- గందరగోళంగా ఉచిత గ్యాస్ పథకం
- రోజురోజుకూ మారుతున్న మార్గదర్శకాలు
- జిల్లాలో గ్యాస్ వినియోగదారులు 6,92,825 మంది
- తాజా ప్రకటన మేరకు అర్హులు 4,96,373 మందే
- తేడా వస్తే మరింత మందికి కోత తప్పని పరిస్థితి



శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఉచిత గ్యాస్ పథకం అమలులో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో దోబూచులాడుతోంది. రోజుకొక నిబంధనతో గందరగోళానికి గురిచేస్తోంది. వంట గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి వారికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని నమ్మించిన చంద్రబాబు, కూటమి పాలకులు ఇప్పుడు కొంతమందికే ఉచిత గ్యాస్ ఇస్తామని చెప్పడం విమర్శలకు తావిస్తోంది. ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు ఒక్కటీ నెరవేర్చలేదని, ఉచిత గ్యాస్‌కి దీపావళి ముహూర్తం పెట్టినా.. అది కూడా లబ్ధిదారులందరికీ వర్తింపజేయకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

చిక్కులెన్నో..

- ఆధార్ కార్డ్, తెలుపు రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్, గ్యాస్ కనెక్షన్ల వివరాలు ఒకేలా ఉండాలి. బ్యాంక్ అకౌంట్ ఆధార్ సీడింగ్ తప్పనిసరి.
- బ్యాంక్ అకౌంట్ యాక్టివ్‌గా ఉండాలి.
- వీటిలో ఏమాత్రం తేడా ఉన్నా అనర్హులు అవుతారు.
- దీనికి తోడు రోజుకొక మార్గదర్శకాలు జారీ అవుతున్నాయి.
- సీడింగ్ ప్రకారం ఆదాయం ఎక్కువ ఉందని గుర్తిస్తే ఉచిత సిలిండర్ల సంగతి పక్కన పెడితే ఏకంగా తెలుపురేషన్ కార్డు తీసేసే అవకాశం ఉంది.

ముందుగా నగదు చెల్లించాలి

సిలిండర్ కొన్నవారు ముందుగా నగదు చెల్లించిన తర్వాత కొద్ది రోజుల్లో ఆ మొత్తాన్ని లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. దీని వెనుక మాయలు ఉన్నాయని, తర్వాత ఏం చేస్తారో తెలియదని, అందరికీ ఇస్తామని చెప్పి కొందరికి ఇస్తున్నట్లే.. ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు ఎన్ని చిక్కులు పెడతారోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఏజెన్సీలు: హెచ్‌పీసీఎల్ 17, ఐఓసీఎల్ 11, బీపీసీఎల్ 9

వంట గ్యాస్ కనెక్షన్లు	
డొమెస్టిక్ సింగిల్ సర్వీసులు	2,00,268
డబుల్ సర్వీసులు	1,40,054
మొత్తం	3,40,322
దీపం పథకం	
సింగిల్ సిలిండర్ లబ్ధిదారులు	2,10,780
డబుల్ సిలిండర్ లబ్ధిదారులు	30,588
మొత్తం లబ్ధిదారులు	2,41,368
ఉజ్వల పథకం లబ్ధిదారులు	93,194
సీఎస్ఆర్ వినియోగదారులు	17,945
అన్ని పథకాలు కలిపి గ్యాస్ కనెక్షన్లు	6,92,825
ఉచిత పథకం వర్తించే లబ్ధిదారులు	4,96,373
పథకానికి నోచుకోని వారు	1,96,452

అమరవీరులు కోరన్న, మంగన్నల 57వ వర్ధంతి సభ నేడు

కాశీబుగ్గ: శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో రక్తతర్పణ చేసిన తొలి ఆదివాసీ అమరవీరులు ఆరిక కోరన్న, కొండగొర్రి మంగన్నల 57వ వర్ధంతి సభను మందస మండలం కొండలోగాం ఆదివాసీ గ్రామంలోని అమరజీవి సవర చిలకమ్మ స్థూపం వద్ద శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు జరగబోయే ఈ స్మారక సభలో పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రజలు, ఇతర ప్రజా సమూహాలు పాల్గొనే ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

పోలీసు అమరవీరులకు జోహార్లు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులకు కొవ్వొత్తుల ప్రదర్శనతో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాలలో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసులు కవాతు చేస్తూ డే అండ్ నైట్ కూడలి మీదుగా దేశ భక్తి గీతాలతో ఏడు రోడ్ల కూడలి వరకు కొనసాగి మానవహారంగా ఏర్పడి అమరవీరులకు జోహార్లతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వ్యాస రచన పోటీలు, వైద్య శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు అవతారం, ఉమామహేశ్వరరావు, పైడిపునాయుడు, ఆర్ఐ నర్సింగరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల గడువు పెంపు

శ్రీకాకుళం రూరల్: స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ తరఫున డిప్లమా పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటా దరఖాస్తులకు గడువును నవంబర్ 3 వరకూ పొడిగించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నవంబర్ 12 వరకూ అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఏ గ్రూప్ ఉత్తీర్ణత సాధించినా అర్హులేనని చెప్పారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం


డీవీఈఓ తవిటినాయుడు

హిరమండలం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకున్నట్లు డీవీఈవో శివ్వాల తవిటినాయుడు తెలిపారు. బుధవారం హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఫస్టియర్‌లో 6436 మంది, సెకెండియర్‌లో 5,939 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే యూనిట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన నందిగాం, నివగాం, గోవిందపురం జూనియర్ కళాశాలలకు భవనాలు లేవని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.

సెస్ బకాయిలు రూ.4 కోట్లు


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి కుమార్‌రాజా

సారవకోట: పంచాయతీలు, మున్సిపాల్టీల ద్వారా గ్రంథాలయాలకు రూ.4 కోట్ల సెస్ బకాయిలు రావాల్సి ఉందని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజా తెలిపారు. బుధవారం సారవకోటలోని మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెస్ బకాయిలు పేరుకుపోవడంతో గ్రంథాలయాలలో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని, సిబ్బంది వేతనాలు సకాలంలో చెల్లించలేకపోతున్నట్లు తెలిపారు. అనంతరం గ్రంథాలయ పనివేళలు గతంలో మాదిరిగానే ఉంచాలని కోరుతూ యువకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సాయమ్మ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం గ్రామంలో ఇటీవల మహిళ చల్ల దమయంతిపై దాడి ఘటనపై అదే గ్రామానికి చెందిన 9 మందిపై కోటబొమ్మాళి పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాసరావు బుధవారం కిష్టుపురం గ్రామానికి వచ్చి బాధితురాలి దమయంతి ఇంటి వద్ద విచారణ చేపట్టారు. దమయంతి, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ కార్యకర్త అప్పలరాజు, కుటుంబ సభ్యులపై దాడి ఘటనపైన ఏఎస్పీ వివరాలు సేకరించారు. మరోసారి డీఎస్పీ ఆధ్వర్యంలో గ్రామంలో విచారణ చేపడతామని ఎస్పీ చెప్పినట్లు బాధితులు తెలిపారు.

పవిత్ర ఆధ్యాత్మిక మాసం

కార్తీకం

- కార్తీక పూజలకు సర్వం సిద్ధం
- నెల రోజులు ఉపవాస దీక్షల మయం
- భక్తులతో దేవాలయాల కిటకిట


శ్రీముఖలింగం ప్రధాన దేవాలయం


దేవాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు (ఫైల్)

జలుమూరు: ఏడాదిలో హిందువులకు అత్యంత పవిత్రమైనది మాసం కార్తీక మాసం. హరి(విష్ణువు), హరుడు (శివుని)కి అతి ప్రీతిపాత్రమైన ఈ మాసంలో ఉపవాస దీక్షలు, నిష్ఠతో పూజలు, ఆలయాల దర్శనాలు చేస్తే కైలాసాన్ని చేరుకుంటారని ఎక్కువ మంది విశ్వసిస్తారు. అదేవిధంగా కార్తీక మాసంలో దేవతాస్నానం(వేకువజామున) చేస్తే యాగఫలం సిద్ధిస్తుందని శ్రీముఖలింగం ఆలయ అర్చకులు చెబుతున్నారు. కార్తీక స్నానం, ఆలయ దర్శనం, దాన ధర్మాలు, ఉపవాస దీక్షలు, వన భోజనం, దీపారాధన తదితర కార్యక్రమాలు ఎలా నిర్వహించాలి, వాటి ఫలితం ఎలా ఉంటుందో అర్చకులు వివరించారు. ప్రధానంగా ప్రత్యేకంగా సోమవారాలు, ఏకాదశి, శనివారంతోపాటు ఇతర రోజుల్లో కూడా ఈ నెల రోజులు అన్నీ పుణ్యదినాలేనని పేర్కొన్నారు.

ఉపవాస ఫలితం

కార్తీక సోమవారం ఆచరించే వారు మరణం తర్వాత కైలాసంలో శివ సన్నిధిని చేరుకుంటారని అర్చకులు చెబుతున్నారు. ఇదే నెలలో ఏ సోమవారాన్ని ఆచరించినా వేయి అశ్వమేధాల యాగాఫలాన్ని పొందుతారన్నారు. అందువలన ఈ మాసంలో ఉపవాసం చేస్తే ఎంతో మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.

ఉపవాసం: భక్తులు కార్తీక సోమవారం పగలంతా ఉపవాస దీక్షలో ఉండి, సాయంకాలం శివుడికి అభిషేకం చేస్తారు.

తిలదానం: మంత్ర జపం తెలియని వారు, ఉపవాస దీక్షలు చేయలేని వారు నువ్వులను బ్రాహ్మణులకు దానం చేస్తే పుణ్యఫలం కలుగుతుంది.

ఏక భుక్తం: ఉపవాస దీక్షలు చేయలేనివారు, ఉదయాన్నే స్నానం చేసి, ఆలయాల దర్శనం తర్వాత మధ్యాహ్న భోజనం చేసి రాత్రికి అల్పాహారం తినవచ్చు.

స్నానం ఫలితం: కార్తీక మాసాల్లో నదుల్లో స్నానాలు చేస్తే మంచిది. అవకాశం లేని వారు కాలువలు, ఇంటి వద్ద ప్రాతఃకాల సాన్నాలు చేసి దేవాలయాలు సందర్శిస్తే ఎంతో మంచిది. కనీసం కార్తీక మాసం నెల రోజుల్లో ఒక్క రోజైనా శివుడిని, విష్ణువుని దర్శించుకుంటే మంచిది. అవకాశం లేని వారు శుక్ల, పాడ్యమి, పౌర్ణమి, అమావాస్య దినాల్లో దేవతా స్నానం(వేకువజాము) చేస్తే పుణ్యఫలం కలుగుతుంది.

దీపారాధన: కార్తీక మాసంలో ఇష్ట దైవమైన శివుడు, విష్ణువు తదితర దేవతలకు పూజలు చేయడం ఎంతో మంచిది. ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో దీపారాధన చేయడం ఎంతో శ్రేష్ఠం. అలాగే దీపం కింద భాగం బ్రహ్మగా, స్తంభం విష్ణువు ప్రతిరూపంగా, ప్రమిదను శివునిగా పురాణాల్లో చెబుతారు. నదులు, జలాశయాలు, చెరువులు, కాలవల్లో దీపాలు వదలడం వల్ల పాపాలు సమిసి పోతాయి. కార్తీక మాసంలో రోజూ దీపాలు వదలడం ద్వారా శాంతి, సుఖం, సౌఖ్యం కలుగుతుందని అర్చకులు చెబుతున్నారు.

వన భోజనం: బ్రహ్మ ముహూర్తంలో ఉదయం నాలుగు గంటలకు లేచి, స్నానమాచరించి, సంధ్యోపాసన చేసి కార్తీక పురాణం పారాయణం చేయాలి. అలాగే అన్ని రకాల వృక్షాలతోపాటు ఉసిరి చెట్టు ఉన్న తోటల్లో వన భోజనం చేస్తే పాపాల నుంచి విముక్తి పొందుతారు. అలాగే కార్తీక దామోదరుడైన విష్ణుమూర్తి అనుగ్రహం పొందవచ్చు.

సాన్నమాచరించడం మంచిది



కార్తీక మాసంలో స్నానం ఆచరించడం ఎంతో మంచిది. ప్రధానంగా దేవతా స్నానం(వేకువజామున) చేసి ఆలయాలు సందర్శిస్తే పాపాలు నుంచి విముక్తులు అవుతారు. అలాగే దాన ధర్మాలు చేయడం వల్ల దేవతా అనుగ్రహం పొందుతారు.

– పంచాది నారాయణ మూర్తి, అర్చకులు, శ్రీముఖలింగం దేవస్థానం

దానంతో అభివృద్ధి



కార్తీక మాసంలో అన్న, వస్త్ర, గోవులు, భూములు, బంగారు వంటివి తమ శక్తి కొలదీ దానం చేస్తే వారికి ఆస్తితోపాటు ఐశ్వర్యం మరింత అభివద్ధి చెందుతారు. దానం చేస్తే మనకున్న డబ్బు, ధనం తరిగిపోతుందనే అపోహ విడనాడాలి. పంచేకొలది పెరుగుతుందని గుర్తుంచుకోవాలి.

– సూర అప్పారావు, అర్చకులు, శ్రీముఖలింగం

దీర్ఘాయుష్షు, ఆరోగ్యం



కార్తీక మాసంలో విష్ణువు ఆలయంలో మామిడి ఆకుల తోరణాలు కట్టి, పువ్వులు, అరటి స్తంభాలు నిర్మిస్తే విష్ణు సాన్నిధ్యాన్ని పొందుతారు. ఈ నెలలో తెల్లని అవిశ(ఆగస్తు) విష్ణువుని, శివుడిని పూజిస్తే మోక్షాన్ని పొందుతారు. మహా శివుడిని తెల్ల జిల్లేడు పువ్వులతో పూజిస్తే దీర్ఘాయుస్సు, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుంది.

– లక్ష్మీ, భక్తురాలు, పశ్చిమ గోదావరి

రైళ్ల రద్దీ


ఆమదాలవలస: రద్దీగా ఉన్న సికింద్రాబాద్ నుంచి వచ్చే రైలు


కాశీబుగ్గ: ఎల్‌సీగేటు వద్ద వాహనదారుల పడిగాపులు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణించే రైళ్లు బుధవారం ప్రయాణికులతో కిక్కిరిశాయి. దీపావళి సందర్భంగా రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య పెరగడంతో ఇబ్బందులు తలెత్తాయి. పండగల సమయంలో ప్రత్యేక రైళ్లు కానీ, అదనపు భోగీలు కానీ ఏర్పాటు చేస్తే ఈ ఇక్కట్లు ఉండవని వాపోతున్నారు. సికింద్రాబాద్, తిరుపతి, విజయవాడ తదితర దూర ప్రాంతాల నుంచి నిలబడి ప్రయాణించామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు సర్వీసులు వేయాలని కోరుతున్నారు.

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి గ్రామం వద్ద బుధవారం పలాస ఆర్టీసీకి చెందిన డిపో బస్సు టైరు పాడవ్వడంతో బస్సు నిలిచిపోయింది. ఈ సందర్భంగా వాహనాలు తప్పించుకునే పరిస్థితి లేక సుమారు అర కిలోమీటరు వరకు వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీపావళి సామగ్రి కొనుగోలు కోసం వెళ్లిన గ్రామీణ ప్రాంతాల ప్రజలు అర గంటకుపైగా రైలుగేటు వేయడంతో పడిగాపులు కాశారు.

దళితుల జీవితాలతో చెలగాటం వద్దు


పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళితుల జీవితాలతో ఆటలాడొద్దని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం గత వారం రోజులుగా జిల్లాలో విషం చిమ్ముతూ దళితుల ఆత్మగౌరవాన్ని అవహేళన చేస్తూ దాడులు చేస్తున్నారన్నారు. టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడి కోటబొమ్మాళి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చల్లా దమయంతిపై పక్షపాత ధోరణి హేయమన్నారు. కోటబొమ్మాళి మండలం కృష్ణాపురంలో దళితవాడలో ఒక ఇంటిలో చొరబడి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై ఒక మహిళను చూడకుండా దాడి చేయడం నీచమైన చర్యని అన్నారు. టెక్కలి మండలం తొలుసురపల్లి పంచాయతీ మునసబుపేట గ్రామానికి చెందిన మొత్తం దళితవాడల్లో రాజ్యాంగబద్ధంగా సబ్సిడీతో కూడిన విద్యుత్ సరఫరా గత ప్రభుత్వం ద్వారా పొందారని, సబ్సిడీ ఉన్నప్పటికీ హఠాత్తుగా ఎటువంటి ముందస్తు డిమాండ్, నోటీస్ లేకుండా బిల్లులు చెల్లించమంటూ కూటమి ప్రభుత్వం అహంకారంతో విద్యుత్ శాఖ లైన్‌మెన్స్‌ను కనీసం పేదవారిని అని కూడా చూడకుండా విద్యుత్ లైన్లు తొలగించి చిమ్మ చీకటి జీవితాలను రుచి చూపించటం హేయమైన చర్యని అన్నారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: గంజాయి అమ్మకం చేస్తున్న ఏడుగురు యువకులను బుధవారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. వివరాలను జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం వెల్లడించారు. ఎచ్చెర్లకు చెందిన నిడిగిట్ల చరణ్, ఎస్ఎంపురం పంచాయతీ లింగాలపేటకు చెందిన సూర రాజ్ కుమార్, ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన లక్కవరపుకోట ప్రసాద్ కుమార్, రణస్థలం వెంకటేశ్వరా కాలనీకి చెందిన గుండ్రాపు బాలగణపతి, రణస్థలం మండలం రావాడ గ్రామానికి చెందిన పిన్నింటి చంటి, కుశాలపురం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన కూన సాయికిరణ్, ఫరీదుపేటకు చెందిన సవలాపురపు వంశీలను అరెస్టు చేసినట్లు చెప్పారు. తోటపాలెం పంచాయతీ దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలోని లేఔట్‌లో రెండు కిలోల గంజాయి కలిగి ఉండగా వీరిని పట్టుకున్నట్లు వివరించారు. వీరి వద్ద నుంచి రెండు ఫోన్లు, ఒక బైక్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయం, గంజాయి వ్యసనానికి బానిసలు కావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. అరెస్టు అనంతరం నిందితులను శ్రీకాకుళం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై వి.సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

యూబీ పరిశ్రమలో సీఐడీ తనిఖీలు


యూబీ పరిశ్రమ ఎదుట సీఐడీ ఉద్యోగులు

రణస్థలం: రణస్థలం మండలంలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో బుధవారం సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. 2019–24 మధ్య జరిగిన లావాదేవీలపై సుమారు 12 మంది కలిగిన సీఐడీ బృంద సభ్యులు తనిఖీలు చేపట్టారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యుత్ బిల్లులు, ఐదేళ్ల ఉత్పత్తి, అమ్మకాల రికార్డుల వివరాలు నమోదు చేసుకున్నారు. రికార్డులు, హార్డ్ డిస్కలు తమ వెంట తీసుకువెళ్లారు. ఉత్పత్తి, బీరు బాటిల్ లేబుల్లు, ఉద్యోగుల వివరాలు, లారీల ట్రాన్స్‌పోర్ట్, కార్మికుల రికార్డులు, ఆర్థిక లావాదేవిలను క్షుణ్ణంగా పరిశీలించారు. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు తనిఖీలు నిర్వహించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ డి.వాసుదేవరెడ్డి 18 ఆగస్టు 2022లో యూబీ పరిశ్రమను సందర్శించారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ప్రభుత్వం తనిఖీలు నిర్వహించినట్టు పరిశ్రమ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ తనిఖీల్లో సీఐడీ డీఎస్పీ, సీఐ, సిబ్బంది, రణస్థలం రెవెన్యూ, ఎక్సైజ్, విజిలెన్స్, జీఎస్టీ ఉద్యోగులు, పోలీసులు వంటి అధికారులు సుమారు 40 మంది పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ ఆర్ఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రైలు కిందపడి పాతపట్నం పెద్దింటి వీధికి చెందిన పొట్నూరు శంకర్ (50) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నంకి చెందిన శంకర్ బుధవారం ఉదయం నౌపడ రైల్వేస్టేషన్‌కు కొంతదూరంలో రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియలేదన్నారు. అనంతరం మృతదేహాన్ని పలాస ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

టెక్కలి రూరల్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న సంపతిరావు దివ్య(28) అనే వివాహిత బుధవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు గత కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతుందని, దానిని తట్టుకోలేక బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే మృతురాలి భర్త ఎస్.శ్రావణ్ కుమార్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 14వ వార్డు ఐజే నాయుడు కాలనీకి చెందిన ధారణి తులసీనాథ్ అనే బాలుడుపై బుధవారం కుక్కలు దాడి చేశాయి. చిన్నకృష్ణాపురం పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి స్కూల్ నుంచి వస్తున్న సమయంలో సుమారు పది కుక్కలు 30 మంది విద్యార్థులపై ఒకేసారి దాడికి దిగాయని, స్థానికులు చొరవతో విద్యార్థులు తప్పించుకోగా ఈ విద్యార్థికి మాత్రం చేతిపై గాట్లు వేసినట్టు స్థానికులు చెబుతున్నారు.

శిక్షణ వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: రైతులు ఎరువుల డీలర్లుగా మారడానికి వ్యవసాయ పరపతి సంఘాల ప్రతినిధులకు అందించే శిక్షణ వినియోగించుకోవాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. కేవీకేలో 15 రోజులుగా మేనేజ్ మరియు సమితి వారి ఆర్థిక సౌజన్యంతో వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని బుధవారంతో ముగింపు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ 15 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రాథమిక సహకార సంఘ సభ్యులు చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులకు ఎరువుల డీలర్స్‌గా మారడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులను కూడా వ్యవసాయంలో వినియోగిస్తే పర్యావరణం కలుషితం కాకుండా, మానవాళి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమగ్ర ఎరువుల యాజమాన్యం చేయకపోయినా పంటకు నష్టం వాట్లే అవకాశం ఎక్కువగా ఉందని తెలుపుతూ, ఎరువులు వాడకములోని మెలకువలను వాటి తాలూకు పోషక నివారణ చర్యలను ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా తెలుసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో తొగరం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నేలవేణి, రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ బాబు, డాక్టర్ అనూష, డాక్టర్ బాల కృష్ణ, శ్రీకాకుళం మరియు పాడేరు ప్రాథమిక సహకార సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు .

మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు


కంచిలి: మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామంలో వెలసిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకిన సందర్భం చోటుచేసుకొంది. బుధవారం ఉదయం 6.42 గంటల సమయంలో సూర్యకిరణాలు అమ్మవారి విగ్రహాన్ని తాకడంతో భక్తులు ఆ దృశ్యాన్ని తిలకించారు. ఇటువంటి మహద్భాగ్యం చూసినందుకు ఆనందం వ్యక్తం చేశారు.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వ వార్డు పురుషోత్తపురం గ్రామంలో స్వయంభూ లింగేశ్వరుడు(ఉమా నీలకంఠేశ్వర స్వామి)ఆలయంలో బుధవారం కిరణ స్పర్శ ఉదయం 6.30 గంటలకు కలిగింది. కార్తీక మాసంలో పదిహేను రోజులు, మాఘ మాసంలో పదిరోజులు ఈ కిరణ స్పర్శ ఉంటుందని ఆలయ పూజారులు, స్థానికులు చెబుతున్నారు. పురాతన ఆలయం కావడంతో అప్పటి నిర్మాణ శైలి అంతగొప్పగా ఉండేదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా తైక్వాండో ఎంపికలు


ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే మహిళా తైక్వాండో క్రీడాకారిణుల ఎంపిక ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. 24 మంది హాజరుకాగా ముగ్గురిని ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో ఎల్.జగదీశ్వరి (శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాల), ఎ.భువనేశ్వరి (శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల, ఎచ్చెర్ల), యు.అను (ఆదిత్య డిగ్రీ కళాశాల, ఇచ్ఛాపురం) ఎంపికయ్యారు. వీరు నవంబర్ 12 నుంచి 15 వరకు అమృతసర్‌లోని గురునానక్ దేశ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. ఈ ఎంపికలకు మజ్జి గౌతం, సాయిబాలాజీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ పర్యవేక్షించారు.

సీబీఐ కానిస్టేబుల్ మృతి


గోవిందరావు(ఫైల్)

జలుమూరు: సైరిగాం పంచాయతీ పరిధి లింగన్నాయుడుపేటకు చెందిన సీబీఐ కానిస్టేబుల్ కొర్ను గోవిందరావు(39) మంగళవారం రాత్రి చెన్నైలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సీఆర్‌పీఎఫ్‌లో సాధారణ విధులు నిర్వహిస్తున్న గోవిందరావు కొద్ది సంవత్సరాల క్రితం సీబీఐకి డిప్యూటేషన్‌పై వెళ్లారు. నాలుగు రోజులుగా క్రితం అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడుకు భార్య సత్యవతి, పిల్లలు అంజన్, ధనుస్సు, తల్లిదండ్రులు రమణమ్మ, సంజీవ్ ఉన్నారు. గోవిందరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. ఆయన మృతిపై మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ ధర్మాన అనిత, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన రమణమూర్తి, జగన్ తదితరులు సంతాపం తెలిపారు.

ఐటీడీఏ హామీ నిలబెట్టుకోవాలి

సారవకోట : జిల్లాకు పర్యటనకు శుక్రవారం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐటీడీఏ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన జారీ చేసి ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు కోరారు. బుధవారం సారవకోటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీఇచ్చారని గుర్తు చేశారు.